





కంకిపాడులో నడి రోడ్డుపై ఏర్పాటుచేసిన సభ

అధికారం మాది.. మమ్మల్ని ఎవరు ఆపేది?

'మాది అధికార పార్టీ. ఏం చేసినా మమ్మల్ని అడిగేదెవరు? ఆపేదెవరు?' అన్నట్టుంది వైసీపీ నేతల తీరు. పైగా మంత్రి జోగి రమేష్ పాల్గొనే సభ కావడంతో నిబంధనలు అడ్డురాలేదు. అధికారులు అడ్డు చెప్పలేదు. పోలీసులు అడ్డగించలేదు. మంగళవారం కంకిపాడులో నడిరోడ్డుపై వైఎస్సార్ ఆసరా సభ నిర్వహించారు. బస్సులు, వాహనాలను మళ్లించారు. మధ్యాహ్నం నుంచి ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలిగించారు. ప్రజలను అవస్థలపాలు చేశారు. ప్రతిపక్ష పార్టీలు రోడ్డుపై నిరసన తెలిపితే అరెస్టులు చేసి అడ్డగించే పోలీసులు అధికార పార్టీకి అంటకాగడం గమనార్హం. - కంకిపాడు

- 4లో..



ఆధ్యాత్మిక వైభవం

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో మల్లేశ్వరాలయ పునఃప్రారంభ కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 18వ తేదీ వరకు భారీగా పూజా కార్యక్రమాలు, హోమాలు జరగనున్నాయి. 18న ఆలయ స్వర్ణశిఖర కుంభాభిషేకం జరగనుంది.

టీడీపీ టార్గెట్ యువ!

యువ ఓటర్లే లక్ష్యంగా కార్యక్రమాలు

యువ ఓటర్లపై తెలుగుదేశం దృష్టి సారించింది. మొదటి సారి ఓటు వేయబోతున్న యువతను లక్ష్యంగా చేసుకుంది. వీరి కోసం పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలకు సిద్ధమవుతోంది. యువ ఓటర్లు తాము ఎందుకు ఓటు వేయాలో తెలుపుతూ ఈ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు. ప్రస్తుతం ఏపీ ఉన్న పరిస్థితి నుంచి బయటపడాలంటే యువత ఓటు ఎంత కీలకమో అవగాహన కల్పించేలా 'మై ఫస్ట్ ఓట్ టు ఏపీ' కార్యక్రమానికి రూపకల్పన చేశారు.

- మై ఫస్ట్ ఓట్ టు ఏపీ పేరుతో సమావేశాలు
- దేవినేని చందుకు మచిలీపట్నం పార్లమెంటు, విజయవాడ తూర్పు బాధ్యతలు
- కిలారు నాగ శ్రవణ్‌కు విజయవాడ పార్లమెంటు బాధ్యతలు



దేవినేని చందు



కిలారు నాగ శ్రవణ్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మొత్తం ఓటర్ల సంఖ్య 31,93,250. వీరిలో తొలి సారి ఓటు హక్కు వినియోగించుకునే వారి సంఖ్య సుమారు 70వేల వరకు ఉంటుంది. వీరితోపాటు 25 ఏళ్లలోపు ఉన్న ఓటర్ల సంఖ్య మరో 2 లక్షల వరకు ఉంటుందని అంచనా. మొత్తం మీద యువ ఓటర్లు రానున్న ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని లక్ష్యంగా చేసుకుని టీడీపీ 'మై ఫస్ట్ ఓట్ టు ఏపీ' కార్యక్రమానికి రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా తొలి ఓటర్లతోపాటు యువతను లక్ష్యంగా చేసుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 'దేశ దిశ, దశను మార్చే అస్త్రం ఓటు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కు ద్వారా ప్రభుత్వాలను, పాలకులను ఎన్నుకునే గొప్ప అవకాశం ఉంది. అందుకే యువత ఓటును నిర్లక్ష్యం చేయొద్దు' అని చెప్పడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం.

కార్యక్రమాల బాధ్యతలు అప్పగింత

మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాలు, విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 'మై ఫస్ట్ ఓట్ టు ఏపీ' కార్యక్రమాలను తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని చంద్రశేఖర్ పర్యవేక్షించనున్నారు. త్వరలో అవనిగడ్డ, పెడన, గుడివాడ, మచిలీపట్నం, పామర్రు, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం రెండు మీటింగ్స్ నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. టౌన్ హాల్ మీటింగ్స్, కళాశాలల దగ్గర యువతకు అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. విజయవాడ పార్లమెంటు పరిధిలోని మిగిలిన 6 నియోజకవర్గాల్లో కిలారు నాగశ్రవణ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఏపీ భవిష్యత్తు కోసం మొదటి ఓటు వేయండి

'రాష్ట్ర భవిష్యత్తు యువత చేతిలోనే ఉంది. మనం వేసే ఓటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలి. నిరుద్యోగ సమస్యలు, విద్య, వైద్యం, న్యాయం, భద్రత అందించగలిగే వారికే ఓటు వేయాలి. తొలి ఓటును తెలివిగా వేయాలి. కులం మతం కాదు, నాయకుడి సమర్థత చూసి ఓటేయాల్సిన బాధ్యత యువతపై ఉంది. నేను ఒక్కడినే ఓటు వేయకపోతే పోయేదేముందని అనుకోకుండా, ఒక్క ఓటు మన భవిష్యత్తును, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుందనే అవగాహన యువ ఓటర్లలో కల్పించడమే మా కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం. "ఏపీ భవిష్యత్తు కోసం మీ మొదటి ఓటు వేయండి" అన్న పిలుపుతో యువతను చైతన్యం చేస్తాం.

-దేవినేని చందు



తవ్వకాలులేని క్వారీలో కలెక్టర్ రాజాబాబు, మైనింగ్, ఎన్‌జీటీ అధికారుల బృందం

హవ్వా..! ఇదేం తనిఖీ?

నడుస్తున్న రొయ్యూరు క్వారీని వదిలి మూడున్నరేళ్ల క్రితం మూతపడిన క్వారీలో తనిఖీ

ఎక్కడైనా నడుస్తున్న క్వారీలో తనిఖీలు నిర్వహించి పర్యావరణ అనుమతులు పరిశీలిస్తారు. మూడున్నరేళ్ల క్రితం మూతపడిన క్వారీలో తనిఖీలు జరపటం విడ్డూరమే. తోట్లవల్లూరు మండలంలో మంగళవారం ఇదే జరిగింది.



మంగళవారం రొయ్యూరు క్వారీలో జరుగుతున్న ఇసుక తవ్వకాలు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 13 : కృష్ణానదిలో పర్యావరణానికి హాని కలిగించే విధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు నాగేంద్ర అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. క్వారీలకు అనుమతులు పరిశీలించి నివేదిక అందించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్... అధికారులను ఆదేశించింది. దీంతో కలెక్టర్ రాజాబాబు ఆధ్వర్యంలో అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు పలువురు అధికారుల బృందం పాములలంక వైపున పెద్దపటిపాయలోని నార్తువల్లూరు క్వారీకి మంగళవారం వచ్చింది. ఇక్కడ ఇసుక తవ్వకాలు మూడున్నరేళ్ల క్రితమే నిలిపేశారు. కలెక్టర్ రాజాబాబు తోట్లవల్లూరు మండలంలో ఎక్కడెక్కడ క్వారీలున్నాయని అధికారులను వివరాలు అడగడంతో రొయ్యూరు క్వారీ విషయం వెలుగులోకి వచ్చింది. రొయ్యూరు క్వారీకి అనుమతులు లేవని, స్థానిక తహసీల్దార్ తవ్వకాలను నిలిపివేశారని కలెక్టర్ గుర్తుచేశారు. రొయ్యూరు క్వారీకి పర్యావరణ అనుమతులు (ఈసీ) వచ్చాయని, ఆ సర్వే నెంబరు ఎన్‌జీటీ పరిధిలో లేదని, తవ్వకాలకు దర ఖాస్తు పెట్టుకున్నారని మైనింగ్ సర్వేయర్ రామలక్ష్మీ కలెక్టర్‌కు చెప్పటం విశేషం.

● బృందం వెళ్లిపోయాక యథేచ్ఛగా తవ్వకాలు

కలెక్టర్ బృందం వస్తుందని ముందుగానే సమాచారం అందుకున్న రొయ్యూరు క్వారీ సిబ్బంది మధ్యాహ్నం వరకు తవ్వకాలు ఆపేశారు. అధికారులు వెనుదిరిగిన తరువాత యథాతథంగా యంత్రాలతో ఇసుక తవ్వకాలు మొదలు పెట్టేశారు. తహసీల్దార్ కుసుమకుమారి ఇప్పటికి రెండుసార్లు రొయ్యూరు క్వారీలో తవ్వకాలను ఆపేయించగా మళ్లీ తవ్వకాలు జరుపుతున్నారు. సోమవారం రొయ్యూరు క్వారీపై స్పందనలో లుక్కా వెంకట శ్రీనివాసరావు ఫిర్యాదు కూడా చేశారు.

బందరులో గంజాయి గుప్పు!



చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న పోలీసులు

- రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల కేంద్రంగా విక్రయాలు
- గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో జోరుగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. మచిలీపట్నం రైల్వేస్టేషన్, బైపాస్‌రోడ్ల వెంబడి ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఈ గంజాయి విక్రయాలు జరుగుతుండటం గమనించదగ్గ అంశం. గంజాయికి అలవాటుపడిన యువత అనారోగ్యంపాలై ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. ఇంతా జరుగుతున్నా పోలీసులు నగరంలో గంజాయి విక్రయాలను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవడం లేదు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : విజయనగరం, విశాఖపట్నం, గుడివాడ, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి గంజాయి మచిలీపట్నానికి చేరుతోంది. మచిలీపట్నం రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలు, ఉల్లింగిపాలెం, టెంపుల్‌కాలనీ, శారదానగర్ తదితర ప్రాంతాలకు చేరుతున్న గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. విజయనగరం జిల్లాకు చెందినవారు మచిలీపట్నానికి వలసవచ్చి ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఈ అనుబంధంతో విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనాలతో పాటు, వివిధ వాహనాల్లో గంజాయిని ఇక్కడకు చేరవేస్తున్నారు. మచిలీపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు భోగీలను శుభ్రపరిచే ప్రాంతంలో గంజాయి విక్రయాలు నిత్యం జరుగుతున్నాయి. మరికొందరైతే తమ గృహాల వద్దనే పరిచయం ఉన్న వ్యక్తులకే గంజాయి విక్రయాలు జరుపుతున్నారు. పోలీసులకు గంజాయి విక్రేతల వివరాలు తెలిసినా పట్టించుకోకుండా మిన్నకుండిపోతున్నారు. రాత్రయితే మచిలీపట్నం బైపాస్‌రోడ్ వెంబడి ఉన్న డంపింగ్‌యార్డ్, హిందూ శ్మశానవాటిక, రైల్వేస్టేషన్ పరిసరప్రాంతాల్లో గంజాయి సేవిస్తూ యువత మత్తులో ఊగిపోతున్నారు. గంజాయి సేవించిన అనంతరం ద్విచక్ర వాహనాలను వేగంగా నడుపుతుండటంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందనే భయంతో వణికిపోతున్నారు.

● టిడ్కోగృహాల వద్ద జోరుగా విక్రయాలు

నగరంలోని దేశాయిపేట సమీపంలోని గోసంఘం వద్ద టిడ్కో గృహ సముదాయాలు ఉన్నాయి. ఇవి ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాయి. ఈ గృహసముదాయాల వద్ద ప్రతిరోజూ గంజాయి విక్రయాలు, సేవనం జోరుగా సాగుతున్నాయి. టిడ్కో గృహ సముదాయాల సమీపంలో జాతీయ రహదారిని కలుపుతూ రెండు బైపాస్ రోడ్లున్నాయి. ఎస్ఎన్ గొల్లపాలెం వద్ద నుంచి ప్రారంభమై కాలేఖాన్‌పేట వద్ద చల్లపల్లి రోడ్డుకు కలిసే రెండు బైపాస్‌రోడ్ల వెంబడి నిర్మానుష్యంగా ఉంటుంది. సాయంత్రమయ్యేసరికి పేకాట రాయుళ్లు బైపాస్‌రోడ్ల పైకిచేరి ఒకవైపుపేకాట, మరోవైపు గంజాయి సేవనంతో మత్తులో జోగుతున్నా పోలీసులు ఆ వైపునకు కన్నెత్తి చూడటంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలో జోరుగా గంజాయి విక్రయాలు జరుగుతున్నా ఇటీవల కాలంలో ఒక్కరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకోకపోవడం గమనార్హం. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు గంజాయి విక్రయాల్లో భాగస్వాములుగా ఉండటంతో ఆ వైపునకు పోలీసులు తమ దృష్టిని సారించడం లేదనే విమర్శలున్నాయి. మచిలీపట్నంలో గంజాయి విక్రయాలు నానాటికీ పుంజుకుంటున్నాయని, దీంతో యువత గంజాయి సేవనానికి అలవాటు పడుతున్నారని, పోలీసులు గంజాయి విక్రయాలను అరికట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

ఉద్యోగుల ఉద్యమ కేక!



పోరు పిడికిలి బిగించిన ఏపీఎన్‌జీవో నేతలు

నేటి నుంచే ఏపీజేఏసీ ఆధ్వర్యంలో పోరుబాట

నేడు జిల్లా వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో ఆందోళన

- కలెక్టర్లు, సబ్‌కలెక్టర్లు, తహసీల్దార్లకు సమస్యలపై మెమోరాండాల సమర్పణ
- ఐదేళ్లు కావస్తున్నా.. నెరవేరని సమస్యలు
- ఇచ్చిన హామీలు వాయిదాలతో సరి..

ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఉద్యోగులు ఉద్యమ శంఖారావం పూరించారు. ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా వాయిదాలతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వంతో తాడో, పేడో తేల్చుకునేందుకు బుధవారం నుంచి పోరుబాట పట్టారు. ఎన్నికల ముందైనా ఒత్తిడి తీసుకురావాలన్న కసితో ఉద్యమానికి సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఉద్యోగులు ప్రత్యక్ష పోరాటానికి పూనుకున్నారు. ఏపీజేఏసీ పిలుపు మేరకు ఏపీఎన్‌జీవో సంఘంతో పాటు ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్ల సంఘాలు, కార్మిక సంఘాలన్నీ ఆందోళనకు సిద్ధమయ్యాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉద్యోగులు తొలిరోజు ఉద్యమ కార్యాచరణలో భాగంగా.. నల్లబ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొననున్నారు. భోజన విరామ సమయంలో ఆందోళనలు చేపట్టనున్నారు. గతంలో మాదిరిగా సుదీర్ఘకాలం పాటు ఉద్యమ కార్యాచరణను సాగదీయకుండా ఈనెల 27వ తేదీ వరకే అగ్ర నాయకత్వం కార్యాచరణను ఇచ్చింది. ఎన్నికల నోటిఫికేషన్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్న దిశగా కార్యచరణను కుదించింది. దీంతో ఒకే రోజున అనేక కార్యక్రమాలను నిర్వహించాల్సి వస్తోంది. బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసనలే కాకుండా.. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కూడా ఉద్యమానికి ఊపు తేవటానికి వీలుగా కూడా కార్యక్రమాలను తీసుకుంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లకు తమ డిమాండ్లతో కూడిన మెమొరాండాలు జేఏసీ నేతలు ఇవ్వనున్నారు. డివిజన్ల స్థాయిలో సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలకు అందించనున్నారు. మండల స్థాయిలో తహసీల్దార్లకు మెమొరాండాలు అందించనున్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాలను ఉధృతంగా నిర్వహించనున్నారు. నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైనప్పటికీ భోజన విరామ సమయంలో ఎక్కడికక్కడ ఆఫీసుల్లో ఆందోళనలు తెలపాలని నిర్ణయించారు. గురువారం కూడా ఆందోళనలు సాగుతాయి. తాలూకాల స్థాయిలో పాఠశాలల్లో నిరసనలు చేపట్టనున్నారు. శుక్రవారం నుంచి ఉద్యమం డోస్ పెంచుతారు. ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తారు. - మిగతా 4లో

ఉద్యమం అనివార్యం

- డిమాండ్లు పరిష్కారమయ్యేవరకూ పోరాటం
- ఐదు దశాబ్దాల్లో ఇలాంటి పరిస్థితి రాలేదు
- ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు విద్యాసాగర్

- 4లో..

'సైబర్' ఏసీపీగా తేజేశ్వరరావు

● మచిలీపట్నం డీఎస్పీకి స్థానచలనం

విజయవాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీగా తేజేశ్వరరావు నియమితులయ్యారు. చిత్తూరు జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా ఉన్న ఆయనను ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు బదిలీ చేశారు. రాష్ట్రంలో పలువురు డీఎస్పీల బదిలీల ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. విజయవాడ ట్రాఫిక్ 1 ఏసీపీ ఆర్.రామచంద్రరావును కాకినాడ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ చేశారు. తెనాలిలో పనిచేస్తున్న బి.జనార్ధనరావును ట్రాఫిక్ ఏసీపీగా పంపారు. ట్రాఫిక్ 4 ఏసీపీగా ఉన్న సురేష్‌కుమార్‌రెడ్డిని పోలవరం డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలోకి తిరుపతి సీసీఎస్ డీఎస్పీ ఎం.జనార్ధన్‌ను నియమించారు.

● నెలలోనే ఏమైంది?

మచిలీపట్నం డీఎస్పీగా ఉన్న జె.రాంబాబును తాజాగా విడుదల చేసిన ఉత్తర్వుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ చేశారు. తొలి విడతగా జరిగిన బదిలీల్లో రాంబాబును మచిలీపట్నంలో నియమించారు. ఆయన విధుల్లో చేరి నెల రోజులైనా పూర్తికాలేదు. ఇంతలోనే రాంబాబును బదిలీ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ ఎండీ అబ్దుల్‌సుభాన్‌ను నియమించారు.



స్వామి, అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలు సమర్పిస్తున్న బొప్పన సత్యనారాయణ

వైభవంగా సుబ్బారాయుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మోపిదేవి, ఫిబ్రవరి 13 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవదాయ శాఖ, చల్లపల్లి రాజా వంశీయుల తరఫున ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామి, అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తుల జయజయ ధ్వానాల నడుమ వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్లను ప్రధాన అర్చకులు బుద్ధు పవన్ కుమార్ శర్మ, వేదపండితులు కొమ్మూరి ఫణికుమార్ బ్రహ్మత్వంలో అర్చక బృందం స్వామివారిని పెండ్లి కుమారుడిని గావించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.ఎస్.చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



స్వామివారికి వెండి నాగపడగ బహూకరణ

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మచిలీపట్నంకు చెందిన కె.రామకృష్ణ, సుబ్రహ్మణ్యేశ్వరరావులు వెండి నాగపడగను బహూకరించారు. మంగళవారం ఉదయం కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయానికి ఎద్దుల బండి వితరణ..

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన అమరం శ్రీకాంత్-దీప్తిలు ఎద్దుల బండిని అందజేశారు. స్వామివారి గ్రామోత్సవంలో ఊరేగింపునకు వినియోగించే నిమిత్తం బండిని రూ.2.40లక్షల వ్యయంతో ప్రత్యేకంగా తయారుచేయించి ఈవో ఎస్.ఎస్.చక్రధరరావుకు మంగళవారం అందజేశారు.

అడుగుదాం ఆంధ్రా విజయవంతం చేయండి

» కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 13 : జగన్‌రెడ్డి పాలనలో దగాపడిన తెలుగు తమ్ముళ్లందరూ ఈ నెల 25న ఉయ్యూరు జంక్షన్ వద్ద జరగనున్న 'అడుగుదాం ఆంధ్రా' కార్యక్రమానికి తెలుగు తమ్ముళ్లు, నిరుద్యోగులు హాజరుకావాలని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ పిలుపునిచ్చారు. మచిలీపట్నం పార్లమెంటు కార్యాలయంలో మంగళవారం వాల్‌పోస్టర్‌ను తెలుగుయువత కృష్ణాజిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరితో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం కొనకళ్ల మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో జగన్ అబద్ధపు వాగ్దానాలతో యువత ఓట్లను కొల్లకొట్టి, వారిని వంచించి రాష్ట్రాన్ని నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా మార్చాడన్నారు. గంజాయి ఉత్పత్తిలో రాష్ట్రాన్ని నెంబర్‌వన్‌గా చేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కిందన్నారు. తెలుగుదేశం పాలనలో రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా మారిస్తే జగన్ గంజాయి హబ్‌గా మార్చాడన్నారు. తెలుగుయువత కృష్ణాజిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి మాట్లాడుతూ, 'అడుగుదాం ఆంధ్రా' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంటు సభ్యుడు కింజారపు రామ్మోహన్ నాయుడు పాల్గొంటారన్నారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, తెలుగు యువత ఉపాధ్యక్షుడు హసీంబేగ్, తదితరులు పాల్గొన్నారు.

డోకిపర్రు వాసుల ప్రేమ వెలకట్టలేనిది

» వెనిగండ్ల రాము



డోకిపర్రు పర్యటనలో చిన్నారితో వెనిగండ్ల, రావి

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 13 : 'బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న గుడివాడ నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, పార్టీ నాయకులకు డోకిపర్రు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులివ్వగా గ్రామ పొలిమేర నుంచి ఎడ్లబండ్లతో ఘనస్వాగతం పలికారు. భారీ వర్షాలకు చేలు చెరువులై, రహదారులు ఏరులై పారినపుడు నేనున్నానంటూ గ్రామానికి వచ్చి చేలను రక్షించిన వెనిగండ్ల రాముకు గ్రామస్థులు కృతజ్ఞతగా ఘనస్వాగతం పలికారు. ఒక రైతు మానెడు ధాన్యం వెనిగండ్లకు ఇచ్చారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ, డోకిపర్రు గ్రామస్థుల ప్రేమను మర్చిపోలేనన్నారు. రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని ప్రజల కష్టాలు తీరేతరుణం అతిత్వరలోనే ఉందని రాము అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, మాజీమంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని వెంకట్రావు, వల్లభనేని బాబూరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, తోట చిన్నారి తదితరులు పాల్గొన్నారు.


రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి

» పల్లెబాటలో వర్ల కుమార్ రాజా



పెదపారుపూడి, ఫిబ్రవరి 13 : రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని నాగాపురం, దోసపాడు తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ రాజా నాగాపురంలో పల్లె నిద్ర చేశారు. గ్రామాల్లో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట పొలాలను స్వయంగా పరిశీలించారు. రైతుకు వెన్ను దన్నుగా టీడీపీ ఉంటుందని, రైతు ఆర్థికంగా ఎదగటానికి తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గ్రామాలలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చలసాని రమేశ్ చౌదరి, దానబోయిన వెంకటనారాయణ, సరదా శివకుమార్, కొండపనేని శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు



అన్నే భరత్, జి.శిరీష, కె.డైసీ కిమ్

ఉయ్యూరు, ఫిబ్రవరి 13 : ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో శ్రీ శ్రీనివాస విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విద్యా సంస్థల డైరెక్టర్ పచుచూరి శ్రీనివాసరావు అన్నారు. విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో తమ కళాశాల విద్యార్థులు అన్నే భరత్ (99.7శాతం), టి.శివరామకృష్ణ (99.3శాతం) జి.శిరీష, కె.డైసీ కిమ్ మంచి ఫలితాలు సాధించారన్నారు. అదే విధంగా 23 మంది విద్యార్థులు 90 శాతం కంటే ఎక్కువ సాధించారని తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

అంగన్వాడీల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, ఫిబ్రవరి 13 : విజయవాడ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మినీ అంగన్వాడీ కార్యకర్త, సహాయకుల ఖాళీల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిశు సేవ అభివృద్ధి పథక అధికారిణులు జి.మంగమ్మ, టి.నాగమణిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ అంగన్వాడీ కార్యకర్తలకు సంబంధించి గొల్లపూడి-16 (గొల్లపూడి గ్రామం/బీసీ-ఎ), అంగన్వాడీ సహాయకులకు సంబంధించి ఎనికేపాడు (ఎనికేపాడు గ్రామం/బీసీ-డి), గుణదల-4 (2వ డివిజన్, ఓసీ), ద్వారకానగర్-1 (17వ డివిజన్, ఓసీ), తారకరామానగర్ (18వ డివిజన్, ఓసీ) ఖాళీ పోస్టులను భర్తీ చేయనున్నట్టు ఆమె తెలిపారు.

విజయవాడ అర్బన్ పరిధిలోని ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సీడీపీవో టి.నాగమణి తెలిపారు. 45వ డివిజన్ న్యూ జోజినగర్-3 ఓసీ కేటగిరిలో, 63వ డివిజన్ రాజీవ్‌నగర్-7 ఓసీ ఆర్థికంగా బలహీన వర్గం కేటగిరిలో, 63వ డివిజన్ రాజీవ్ నగర్ వడ్డెర కాలనీ ఓసీ కేటగిరిలో, 59వ డివిజన్ లూనా సెంటర్-2 ఓసీ కేటగిరిలో అంగన్వాడీ సహాయకుల పోస్టులు భర్తీ చేయనున్నట్టు ఆమె తెలిపారు.

అంగన్వాడీ సహాయకురాలి పోస్టులకు 1-7-2023 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణత పొంది స్థానికంగా వివాహితురాలై వుండాలన్నారు. అభ్యర్థులు కుల ధృవీకరణ, నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డులను గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించి, రెండు ఫొటోలు జతచేసి ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కానూరు సీడీపీవో విజయవాడ అర్బన్ కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేయాలని ప్రకటనలో కోరారు.

ఉద్యమం అనివార్యం

» డిమాండ్లు పరిష్కారమయ్యేవరకూ పోరాటం
» ప్రభుత్వానికి సహకరించాం.. సమయమిచ్చాం
» వాయిదాలే తప్ప సమస్యలు పరిష్కారం కాలేదు
» ఐదు దశాబ్దాల కాలంలో ఇలాంటి పరిస్థితి రాలేదు
» ఎన్జీవో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : 'ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన బకాయిలను సత్వరమే చెల్లించాలని, వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని గత నాలుగేళ్లుగా ప్రభుత్వానికి వివిధ రూపాల్లో విజ్ఞప్తి చేశాం. చర్చల పేరుతో ప్రతిసారీ వాయిదాలే తప్ప పురోగతి లేదు. ఇక మావల్ల కాదు. ఉద్యోగ వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమానికే సిద్ధమయ్యాం' అని ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం గతంలో ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ యధావిధిగా కొనసాగుతుందన్నారు. దీనిలో భాగంగా 14వ తేదీ బుధవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామన్నారు. తహసీల్దారు, సబ్‌కలెక్టర్, కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించటం జరుగుతుందన్నారు. 15, 16 తేదీల్లో నల్ల బ్యాడ్జీలతో విధుల్లో పాల్గొనటంతో పాటు మధ్యాహ్న భోజన విరామ సమయంలో తాలూకా కేంద్రాలు, పాఠశాలల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 17వ తేదీన తాలూకా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నా చేపడతామన్నారు. 20వ తేదీన జిల్లా కలెక్టరేట్ల వద్ద ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తామని, 21 నుంచి 24 వరకు రాష్ట్ర నేతలు అన్ని జిల్లాల్లో పర్యటించి సన్నాహక సభల్లో పాల్గొంటారని తెలిపారు. 27వ తేదీన చేపట్టనున్న 'చలో విజయవాడ'కు ఉద్యోగులను సిద్ధం చేస్తామని చెప్పారు. అపరిష్కృతంగా వున్న అన్ని సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు విశ్రమించేది లేదన్నారు. ప్రభుత్వం చర్చలకు పిలిచిన ప్రతిసారీ మాటలే తప్ప ఒక్క సమస్యను కూడా సంపూర్ణంగా పరిష్కరించలేదన్నారు. మంగళవారం మంత్రుల బృందంతో జరిగిన సమావేశంలో కూడా మంత్రులు కొత్త వాయిదాలు కోరారే గాని పాత వాయిదాల గురించి ప్రస్తావన లేకుండా మాట్లాడటం వల్ల ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదన్నారు. ఉద్యోగులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ ప్రభుత్వం 11 సార్లు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించినా నిష్ప్రయోజనమన్నారు. డీఏలు, పీఆర్‌సీల మాట దేవుడెరుగు.. కనీసం జీపీఎఫ్ నిధులు ఎంత పెండింగ్ ఉన్నాయనేది తెలపడం లేదన్నారు. ఇలాంటి దుస్థితిని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొన్న చరిత్ర గతంలో ఎప్పుడూ లేదన్నారు. ఇటువంటి ఇబ్బందికర పరిస్థితుల్లోనే ఉద్యోగ సంఘాలు ఉద్యమ బాటను ఎంచుకున్నాయన్నారు. సమావేశంలో జిల్లా జేఏసీ కన్వీనర్ ఎండీ ఇక్బాల్, ఉపాధ్యాయ సంఘాల నుంచి యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాసిం, ఎన్టీఆర్ జిల్లా ఎన్జీయూ అధ్యక్షుడు ఎస్‌కె ఇమ్రాన్ సాహెబ్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాలి నాయుడు, విష్ణువర్ధన్ పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల సంఘం చైర్మన్ ఎ.సాంబశివరావు, ఐటీఐ ఉద్యోగుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కిషోర్‌బాబు, గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు శశిధర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.సతీష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బీవీ రమణ, విజయవాడ నగర కార్యదర్శి సంపత్‌కుమార్, మధుసూధనరావు, మహిళా కార్యదర్శి కె.శివలీల, ఏపీ జేఏసీ లోని వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తిన్నింటి వాసాలు లెక్కించే రకం నాని

» కేశినేనిపై బొండా ఉమా ధ్వజం

పాయకాపురం, ఫిబ్రవరి 13 : కేశినేని నాని తిన్నింటి వాసాలు లెక్కించే రకమని, కుక్కకు ఉన్న విశ్వాసం కూడా ఆయనకు లేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో ఉమా మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో ఎంపీగా ఉన్న సమయంలో ఆర్థికంగా రూ. 2 వేలకోట్లు నష్టపోయానని కేశినేని నాని తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. 2014 ఎన్నికల్లో ఆస్తులు రూ. 37,68,10,451, అప్పులు రూ. 66,69,45,927 అలాగే 2019 ఎన్నికల్లో ఆస్తులు రూ.66,07,62,440 అప్పులు రూ. 51,23,32,955 ఉన్నాయని అఫిడవిట్‌లో పేర్కొన్నాడని చెప్పారు. మరి రూ2వేల కోట్లు ఏవిధంగా నష్టపోయాడో నాని చెప్పాలన్నారు. తెలుగుదేశం హయాంలో కేశినేని ట్రావెల్స్ ద్వారా ప్రభుత్వాన్ని చంద్రబాబునాయుడిని కూడా మోసం చేశారని ఆరోపించారు. చంద్రబాబుపై అవాకులు చవాలకులు పేలితే బండారం మొత్తం బయటపెడతామని హెచ్చరించారు. నేతలు పరుచూరి ప్రసాద్, నవనీతం సాంబశివరావు, గరిమెళ్ల చిన్నా, లబ్బా వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

యువత బ్రాండ్ అంబాసిడర్లు కావాలి

» కలెక్టర్ ఢిల్లీరావు



ఫారం-6లను విద్యార్థులకు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 13 : ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొనేలా చేయడంలో యువత బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఓటర్లను చైతన్యపరచడం-భాగస్వామ్యం చేయడం (స్వీప్) కార్యక్రమం మంగళవారం నగరంలోని సిద్ధార్థ మహిళా కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు నైతిక విలువలతో కూడిన ఓటింగ్ కీలకమన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అలాగే అందరినీ ప్రోత్సహించాల్సిన బాధ్యత యువతపై వుందన్నారు. విజయవాడ అర్బన్‌లో 84 శాతానికి పైగా పోలింగ్ శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలు చేపడుతున్నట్టు వెల్లడించారు. జిల్లాలో యువ ఓటర్ల నమోదుకు విద్యాసంస్థల భాగస్వామ్యంతో ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టినట్టు తెలిపారు. ఈవీఎంకు సంబంధించి బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ గురించి కలెక్టర్ విద్యార్థులకు క్షుణంగా వివరించారు. ఫారం-6లను అధికారులతో కలిసి విద్యార్థులకు అందజేశారు.

స్వీప్ నోడల్ అధికారి యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ, కలెక్టర్ ప్రత్యేక కృషి కారణంగా అర్హులైన యువ ఓటర్లను పెద్దఎత్తున ప్రోత్సహించడం మంచి ఫలితాలు ఇచ్చినట్టు తెలిపారు. కళాశాల డైరక్టర్ టి.విజయలక్ష్మి ఓటు హక్కు ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు దేవినేని మధుసూదనరావు, మనం ఓటు వేద్దాం.. మన భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం అంటూ అవగాహన కల్పించారు. ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ ఎస్వీ రవీంద్రనాథ్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఉద్యమ కేక!

(3వ పేజీ తరువాయి)

చివరగా అగ్ర నాయకత్వాలు జిల్లాస్థాయిలో నిర్వహించే సభలతో సుడిగాలి పర్యటనలు చేస్తూ ఉద్యోగుల్లో ఉద్యమ కాక రేపనున్నారు. ఆ తర్వాత ఈ నెల 27వ తేదీన చలో విజయవాడ నిర్వహిస్తారు. ఆ తర్వాత కూడా ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మె దిశగా ఉద్యోగులు కదిలే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏపీజేఏసీ ఒక్కటే ఉద్యమానికి పిలుపు ఇచ్చింది. మరో ప్రధానమైన 'ఏపీజేఏసీ అమరావతి' ఉద్యమానికి సిద్ధం కాలేదు. దీని పరిధిలోని ప్రధానమైన రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు తదితర శాఖలకు చెందిన ఉద్యోగులు ఎన్నికల విధుల్లోకి వెళ్లడం, జిల్లాలు కూడా మారిపోవటంతో.. ఉద్యమం దిశగా నిర్ణయం తీసుకోలేదు. విజయవాడలోని ఏపీ రెవెన్యూ భవన్‌లో ఏపీజేఏసీ నేతలు వచ్చి సంప్రదింపులు జరిపినప్పటికీ చర్చలు ఫలించలేదు. ఏపీ జేఏసీ పిలుపునిచ్చిన ఉద్యమం చివరిదశ దాకా వెళితే.. ఛలో విజయవాడకు కానీ, ఆ తర్వాత సమ్మెకు పిలుపునిస్తే ఏపీజేఏసీ అమరావతి కూడా మద్దతు ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఉద్యమ బాటలోకి ఎందుకంటే..

ఉద్యోగులు దాచుకున్న ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ వంటి డబ్బులను కూడా ప్రభుత్వం వాడేసుకుంది. దీంతో వారికి చెల్లింపులు జరపటం లేదు. వీటితో పాటు సరెండర్ లీవ్స్ ద్వారా ఉద్యోగులు ఎన్‌క్యాష్‌మెంట్ పొందుతారు. వీటిని కూడా ప్రభుత్వం చెల్లించకుండా బకాయి పెట్టింది. ఉద్యోగులకు ప్రతి ఆరు నెలలకు ప్రకటించాల్సిన డీఏలను పెండింగ్‌లో పెట్టేసింది. ఇవన్నీ చూస్తుండగానే కొండలా పేరుకుపోవటంతో.. ఉద్యోగులలో ఆందోళన నెలకొంది. అధికారంలోకి రాగానే గతంలో ప్రకటించిన ఐఆర్‌ను 27 శాతం ప్రకటించిన ప్రభుత్వం.. పీఆర్సీ నివేదిక వచ్చిన తర్వాత తూచ్ అంటూ గత ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం కంటే కూడా మరో రెండు శాతం తగ్గించి 23 శాతం చేసింది. దీని పేరుతో ఇప్పటికే ఎక్కువ ఇచ్చేసిన మొత్తాన్ని రికవరీ చేసేందుకు తెగపడింది. పెన్షనర్లకు సంబంధించిన అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ 10 శాతాన్ని కూడా కోల్పోవాల్సి వచ్చింది. పీఆర్సీ బకాయిలను కూడా చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టింది. ఇలా చూస్తే వేల కోట్ల రూపాయలు బకాయిలుగా పేరుకుపోయాయి. వీటి కోసం ఉద్యోగులు ఉద్యమం చేసిన ప్రతిసారీ చర్చలకు పిలవటం.. చెల్లింపులకు షెడ్యూల్ ప్రకటించడం పరిపాటిగా మారింది. జీతాలు సక్రమంగా అందుకోలేని పరిస్థితి ఏర్పడింది. సీపీఎస్ రద్దు అమలు కాలేదు. ఇలా ప్రతిశాఖ పరిధిలోనూ ఉద్యోగులు ఆర్థిక, ఆర్థికేతర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

నడిరోడ్డుపైనే ఆసరా సభ!

» పోలీసుల ట్రాఫిక్ ఆంక్షలు
» ప్రయాణికులకు తప్పని అవస్థలు
» కంకిపాడులో అధికార పెద్దల నిర్వాకం



అడుగడుగున ట్రాఫిక్ మళ్లింపు

కంకిపాడు, ఫిబ్రవరి 13 : కంకిపాడులో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సభ స్థానిక ప్రజలకు శాపమైంది. మంత్రి జోగి రమేశ్ సభ పేరుతో మంగళవారం మండల కేంద్రమైన కంకిపాడును పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ఎక్కడక్కడ ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రధాన సెంటర్‌లో బస్సులు, వాహనాలు రాకుండా ట్రాఫిక్ మళ్లించారు. దీంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్త జోగి రమేశ్ వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని చేపట్టారు. కంకిపాడులోని ప్రధాన రహదారిపై సభకు ఏర్పాట్లు చేయడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచే ట్రాఫిక్ ఆంక్షలు విధించటం శోచనీయం.

అక్క చెల్లెమ్మలు మండుటెండలో.. కార్యకర్తలు ఏసీలోనా.. : మహిళల ఆగ్రహం

ఇటీవల మంత్రి జోగి పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్తగా నియమించిన సమయంలో వైసీపీ శ్రేణులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాన్ని కంకిపాడులో ఓ ఏసీ కళ్యాణమండపంలో భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం డ్వాక్రా మహిళల ఆసరా కార్యక్రమాన్ని నడిరోడ్డుపై మండుటెండలో నిర్వహించటంపై మహిళలు మండిపడుతున్నారు. కార్యకర్తలకు ఏసీలోనూ, అక్క, చెల్లెమ్మలు అంటూ తమకు మండుటెండలోనా అంటూ మహిళలు ఆగ్రహం చేశారు.

అధికార పార్టీ నేతలకు బుజ్జగింపులు

వైఎస్సార్ ఆసరా సభ అలిగిన అధికార పార్టీ నేతలను బుజ్జగించే కార్యక్రమంలా సాగింది. సభ నిర్వహిస్తుండగా గ్రామ అధ్యక్షుడు ఓంకారం, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దూళిపూడి కిషోర్‌లు హాజరు కావడం లేదనే సమాచారంతో మంత్రి వారిని బుజ్జగించేందుకు స్వయంగా వారి ఇళ్లకు వెళ్లడాన్ని పలువురు విమర్శించారు.

వైసీపీ బూత్ ఏజెంట్ల సమావేశానికి వలంటీర్లు!



తిరువూరు: పట్టణంలోని 16వ వార్డులో వైసీపీ బూత్ ఏజెంట్ల సమావేశంలో వార్డు వలంటీర్లు పాల్గొనటంపై పలువురు విమర్శించారు. మంగళవారం వార్డుకు చెందిన నేత ఇంటి వద్ద పార్టీ నాయకులు, బూత్ ఏజెంట్లతో పాటు వలంటీర్లు పాల్గొన్నారు. వార్డులో పింఛన్లు ఇతర సంక్షేమ పథకాలు పొందిన వారిని తమవైపు తిప్పుకునే కుట్రలో భాగంగా వైసీపీ నాయకులు బూత్ ఏజెంట్ల సమావేశానికి వలంటీర్లను పిలిపించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి కార్యక్రమాల్లో వలంటీర్లు పాల్గొరాదనే ఆదేశాలు ఉన్నా అది అమలు కావడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ధాన్యం కొనుగోలులో నిండా మునిగారు

» ఆర్బీకేలతో రైతులకు తీవ్ర నష్టం
» అధికారుల తీరుపై ధ్వజమెత్తిన అధికార పార్టీ నేతలు



అధికారులను నిలదీస్తున్న వైస్ ఎంపీపీ, సభ్యులు

కూచిపూడి, ఫిబ్రవరి 13 : ధాన్యం కొనుగోలులో ఈ ఏడాది రైతులు నిండా మునిగారని, బస్తాకు సగటున 200ల వరకు రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని, ఆర్బీకేల ద్వారా రైతులకు తీవ్ర నష్టం జరిగిందని సాక్షాత్తు అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మొవ్వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కందుల కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఆర్బీకే అధికారులు, మిల్లర్లు, దళారులు కుమ్మక్కై రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేశారని దుయ్యబట్టారు. బస్తాకు 200ల వరకు రైతులు నష్టపోయినట్టు తెలిపారు. రైతు ధాన్యాన్ని ఆర్బీకేకు తీసుకు వెళ్లగా అధికారులు సవాలక్ష ఆంక్షలు పెట్టి తిరిగి దళారుల వద్దకే వెళ్లే విధంగా ఎత్తుగడలు వేశారనివాపోయారు. అయ్యంకి సర్పంచ్ నాగబోయిన సునీల్ మాట్లాడుతూ, ఆర్బీకేలో సమాధానం చెప్పే వారే లేకుండాపోయారని, దళారులకు కుర్చీలు వేసి సకల మర్యాదలు చేసి రైతులను పట్టించుకోకపోవటంతో తన 30 ఎకరాల్లో పంటను మధ్య దళారులకే అమ్ముకోవాల్సి వచ్చిందన్నారు. మంత్రిపాలెం సర్పంచ్ పంది కృష్ణ, వేములమడ సర్పంచ్ సీతారామయ్యలు ధాన్యం కొనుగోలులో రైతులు పడిన కష్టాలు, ఆర్బీకేల్లో సిబ్బంది అధికారులు రైతుల పట్ల వ్యవహరించిన తీరుపై సమావేశంలో నిలదీశారు. ఎన్టీఆర్ జిల్లాలో ఒక రూలు, కృష్ణా జిల్లాలో మరొక రూల్ పెట్టారని మండిపడ్డారు.

నిడుమోలు ఆర్బీకేలో అవకతవకలు!

నిడుమోలు ఆర్బీకేలో రూ.50 లక్షల వరకు అవకతవకలు జరిగినట్టు విమర్శలు వచ్చాయని గ్రామ ఉపసర్పంచ్ డొక్కు మురళీ ఆరోపించారు. ఈ క్రాప్ నమోదుకు ఆర్బీకేలో రూ.1000ల చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉన్నాయని, నిధులు విడుదలైన వెంటనే పనులు పూర్తి చేసి సమస్యను పరిష్కరిస్తామని ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ చెప్పారు. ఎంపీపీ ఇందిర, జడ్పీటీసీ రాజులపాటి పార్వతీ, ఎండీవో చంద్రశేఖర్‌రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



18న మల్లేశ్వరస్వామి ఆలయ స్వర్ణశిఖర కుంభాభిషేకం

వన్‌టౌన్ ఫిబ్రవరి 13 : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో మల్లేశ్వరాలయ పునఃప్రారంభ కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం (14 వతేదీ) ఉదయం 9 గంటలనుంచి శాంతిపాఠం విశేష సంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవచనం, 16 మాతృకల పూజ, ఆచార్య, ఋత్విక్ వరణం, దీక్షా ధారణ, రక్షా బంధనం, పంచగవ్య ప్రాశనం, నాందీ దేవత పూజ, యాగశాల సంస్కారం, యాగశాల ప్రవేశం, ద్వారపూజ, 16 స్తంభాల పూజ, కర్కరి స్థాపన, అఖండదీప ప్రజ్వలన కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయంత్రం 3 గంటల నుంచి వాస్తు మండప ఆవాహన, వాస్తుహోమం, వాస్తు పర్యగ్నికరణ, క్షేత్ర పాలక యోగిని నవగ్రహసహిత ప్రధానమంటప ఆవాహనలు, అంకురారోపణం, అగ్నిమధనం, నీరాజనం, మంత్ర పుష్పం తదితరాలను క్రమానుగతంగా నిర్వహిస్తారు. 15వ తేదీ గురువారం ఉదయం 8 నుంచి 12 గంటలవరకు శాంతి పాఠం, గణపతి పూజ, కర్మణః పుణ్యాహవాచనం, మంటప పూజ, మంటపదేవత హోమాలు, మూలమంత్ర హోమాలు, తిరిగి సాయంత్రం 3 నుంచి 7 గంటల వరకు సంభార హోమాలు, అంగ హోమాలు, లింగ హోమాలు, మంటప పూజలు, నీరాజనం, మంత్రపుష్పం కార్యక్రమాలుంటాయి. 16 తేదీ ఉదయం 8 గంటల నుంచిశాంతిపాఠం, గణపతిపూజ, పుణ్యాహవచనం, మంటప పూజలు, మంటప హోమాలు, అంగ హోమాలు, జలాధివాస కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయంత్రం అధివాస హోమాలు, మంటపపూజలు,నీరాజనం, మంత్రపుష్పం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. 17 వతేదీ ఉదయం శాంతిపాఠం, గణపతి పూజ, పుణ్యాహవచనం, మంటప పూజలు, మంటప హోమాలు, అంగ హోమాలు, సాయంత్రం ధాన్యాధివాసం, ఫలాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం, నీరాజనం మంత్రపుష్పం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. 18 వతేదీ ఉదయం 8 గంటల నుంచి కీలక ఘట్టం ప్రారంభమవుతుంది. శాంతి పాఠం, గణపతిపూజ, కర్మణః పుణ్యాహవచనం, అధివాస హోమాలు, గర్తన్యాసం, ధాతున్యాసం, బీజన్యాసం, రత్న న్యాసం నిర్వహిస్తారు. అనంతరం ముహూర్త సమయానికి యంత్రస్థాపన చేస్తారు. విగ్రహస్థాపనం, కళాన్యాసం, కళా హోమాలు, పూర్ణాహుతి, అవభృదం, కల్యాణోత్సవం. ఆశీర్వచనం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.

16న గవర్నర్ జగ్గయ్యపేట రాక



జగ్గయ్యపేట : జగ్గయ్యపేటలో నిర్మించిన 150 అడుగుల జాతీయ స్థూపాన్ని ఆవిష్కరించేందుకు ఈ నెల 16న గం.11.లకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రానున్నట్టు మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయం నుంచి సమాచారం వచ్చిందని, రాష్ట్రానికి ముఖద్వారంగా ఉన్న జగ్గయ్యపేట శాంతినగర్‌లో రూ.30లక్షలు వెచ్చించిన స్థూపాన్ని గవర్నర్ నజీర్ ఆవిష్కరిస్తారని ప్రజలు కార్యక్రమానికి తరలిరావాలని ప్రకటనలో కోరారు.

కోరిక తీర్చలేదని కడతేర్చాలనుకున్నాడు..

» వివాహిత హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 13 : పట్టణంలో మిల్క్‌బూత్ నిర్వాహకురాలు, వివాహిత హత్యాయత్నం కేసులో నిందితుడిని బుధవారం జగ్గయ్యపేట సీఐ జానకీరాం అరెస్టుచేసి కోర్టుకు హాజరు పరిచారు. ఈ నెల 7న సీతారాంపురంలో వివాహితపై హత్యాయత్నం సంచలనం సృష్టించింది. సీసీ ఫుటేజీ, పోలీసు కాల్‌డేటా ఆధారంగా ముగ్గురు సీఐల ఆధ్వర్యంలో ఆరుగురు ఎస్సైలు సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. వత్సవాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ సయ్యద్ జాన్ సైదా అలియాస్ బాజీ జగ్గయ్యపేటలో ఉంటున్నాడు. పాల బూత్ నిర్వాహకురాలు గిద్దా సత్యశ్రీ(35)తో పరిచయం పెంచుకుని ఆమెకు ఆర్థిక సాయం చేశాడు. ఆ చనువుతో కోరిక తీర్చాలని కోరగా.. ఆమె నిరాకరించటంతో పాటు భర్తకు చెప్పటం, ఆపై హెచ్చరించటంతో కక్ష పెంచుకున్నాడు. ఆర్నెల్లుగా ఆమెను హతమార్చాలని పథకం పన్ని గొడ్డలిని తయారు చేయించాడు. ఈ నెల 7న భర్త లేని సమయంలో మిల్క్‌బూత్ నుంచి రాత్రి ఒంటరిగా మోపెడ్‌పై వస్తున్న ఆమెను ముఖానికి మాస్కు ధరించి సైదా గొడ్డలితో దాడిచేసి పల్సర్ బైక్‌పై పరారయ్యాడు. సాంకేతికత ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించారు. బంధువుల ఇంట్లో ఉండగా అదుపులోకి తీసుకున్నారు.

ఎ.కొండూరు వైసీపీలో భగ్గుమన్న వర్గపోరు!

» ఎంపీటీసీ భర్తపై దాడి

విజయవాడ, ఫిబ్రవరి 13 : ఎ.కొండూరు మండలం వైసీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. అరుపులు, కేకలతో మంగళవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయం దద్దరిల్లింది. మండలంలో కొంతకాలంగా నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు బయటపడ్డయి. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం మండలంలోని వైసీపీశ్రేణులు ఆదివారం నిర్వహించనున్న ఆత్మీయ సమావేశం కోసం మండల పరిషత్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇటీవల విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహవిష్కరణకు కార్యకర్తలను తరలించేందుకు ఖర్చుల నిమిత్తం గ్రామాలకు కొంత డబ్బు అందజేశారు. ఆ డబ్బు కొందరికి ఇవ్వలేదని, పార్టీ కార్యక్రమాలకు కొందరు నేతలను పిలవక వర్గ రాజకీయాలు నడుపుతున్నరని సమావేశంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒక సర్పంచ్ భర్తకు, ఒక ఎంపీటీసీ భర్తకు తీవ్ర వాగ్వాదం జరగ్గా కొందరు ఎంపీటీసీ భర్తపై దాడి చేశారు. మరో సర్పంచ్ భర్త మండల వైసీపీ కన్వీనర్, ఇతర నాయకులపై మీరు వర్గ రాజకీయలు నడుపుతున్నారు.. ప్రజాప్రతినిధులను గౌరవించడంలేదు.. కనీసం పార్టీ కార్యక్రమాలు చెప్పడంలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సమావేశ కార్యాలయం అరుపులు, కేకలతో ఎదురుగా ఉన్న పోలీసులు రంగప్రవేశం చేసి గొడవను సర్దుపరచారు. పార్టీ కార్యక్రమాలు ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేయడం పట్ల రాజకీయ పార్టీల నుండి వ్యతిరేకత వ్యక్తమౌతుంది. ఇందుకు అనుమతి ఇచ్చిన ఎంపీడీవోపై చర్యలు తీసుకోవలని వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

గన్నవరం, ఫిబ్రవరి 13 : విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్ జాకబ్‌రాజు అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భం గా జాకబ్ రవి మాట్లాడుతూ, మత్తు పదార్థాల వల్ల జీవితం అంధకారమవుతుందన్నారు. వాటి జోలికి వెళ్లకూడదని, మత్తు వల్ల ఎంతో మంది జీవితాలు దుర్భరంగా మారాయని చెప్పారు. మాదక ద్రవ్యాల విని యోగం వలన కలిగే నష్టాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. నవజీవన్ బాలభవన్ జోనల్ కో-ఆర్డినే టర్ డి.విజయరాణి, హెచ్ఎం ఎస్ఆర్ భవాని పద్మావతి, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

దళితుల పొట్టకొట్టిన జగన్

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఫిబ్రవరి 13 : దళితుల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన 27సంక్షేమ పథకాలను సైకో జగన్‌రెడ్డి రద్దు చేసి వారి పొట్టకొట్టారని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆరోపించారు. మంగళవారం పెనమలూరు దళితవాడలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, దళితులు తమ కాళ్లమీద తాము నిలబడి సమాజంలో తలెత్తుకుని తిరిగేట్లు చేసే అనేక పథకాలను తాము అమలు చేస్తే ఈ దగాకోరు ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ పథకాలకు సంబంధించిన సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లించి వారి గొంతుకోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ ఉద్యో గుల ప్రమోషన్లలో రిజర్వేషన్లను రద్దు చేయడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూమి కొనుగోలు పథకాన్ని రద్దు చేసి ఎస్సీల ఉసురు తీశాడని, బెస్ట్ అవెయిలబుల్ పాఠశాలలు రద్దు చేసి కార్పొరేట్ విద్యను దూరం చేశాడన్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు, సంగెపు రంగారావు, తోటకూర ఉదయభాస్కర్, మట్టాజాన్, బలరాం తదితరులు పాల్గొన్నారు.



పెనమలూరు దళిత కాలనీలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీలో బోడె ప్రసాద్, పార్టీ నాయకులు

చోడవరంలో బోడె హేమ నేతృత్వంలో..

చోడవరంలో బోడె సతీమణి బోడె హేమ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో లింగాల శివ, నెప్పల్లి హరీష్, వెలిసెల రఘు, సింహాద్రి కృష్ణవేణి, గవిర్నేని సీత, మద్దాల వీరయ్య, కలపాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కానూరులో బోడె వెంకట్రామ్ ప్రచారం

యనమలకుదురు 57వ బూత్ పరిధిలో..

యనమలకుదురు 57వ బూత్ పరిధిలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ కార్యదర్శి మొక్కపాటి శ్రీనివాస్, బలగం కొండ తదితరులు పాల్గొని టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు.



ఉయ్యూరు 2వ వార్డులో దేవినేని గౌతమ్ ప్రచారం

రాష్ట్రంలో వచ్చేది చంద్రబాబు ప్రభుత్వమే..

రాష్ట్రంలో వచ్చేది చంద్రబాబు ప్రభుత్వమేనని టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్ పేర్కొన్నారు. తాడిగడప మునిసిపాలిటీ కానూరు కృష్ణానగర్‌లో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, తెలుగుజాతి అభ్యున్నతికి కృషి చేసిన చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమం లో టీడీపీ కృష్ణాజిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి, టీడీపీ రెహమాన్, కోసూరి రమేష్, అంగిరేకుల మురళి, వహాబ్, అమీరా, ఇక్బాల్, పవన్, ఇమాం, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం..

ఉయ్యూరు : రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యమంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు దేవినేని గౌతమ్, స్మిత అన్నారు. ఉయ్యూరు 2వ వార్డులో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం 50 ఏళ్ల వెనక్కు వెళ్లిందన్నారు. రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఎన్నుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పి. సత్యనారాయణ, సాంబశివరావు, ఏసుపాదం, గోరంట్ల నరేంద్ర, కరీం బేగ్ పాల్గొన్నారు.

నేడు గంగూరులో

విద్యా సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ

పెనమలూరు, ఫిబ్రవరి 13 : గంగూరు విజయ స్పిన్నింగ్ మిల్స్ వద్ద విద్యా సరస్వతి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం జరుగుతుందని ఆలయ ధర్మకర్తలు ఈడ్పుగంటి బుచ్చిబాబు దంపతులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం యంత్ర, ధ్వజస్థంభ ప్రతిష్ఠామహోత్సవాలు వేడుకగా జరుగుతాయని,అనంతరం పూర్ణాహుతి, అవబంధం, శాంతికల్యాణం, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణను వేదపండితులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి



నాదెండ్ల మనోహర్‌ను కలిసిన కామేశ్వరరావు

కంకిపాడు, ఫిబ్రవరి 13 : జనసేన బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రచార కమిటీ కో- ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు అన్నారు. జిల్లా ప్రచార కమిటీ కో -ఆర్డినేటర్‌గా నియమించిన నేపథ్యంలో మంగళవారం జనసేన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహ ర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కల్యాణ్, జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు.



పార్టీలో చేరిన వారితో గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

పార్టీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 13 : టీడీపీతోనే యువతకు భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నమ్మిన ప్రజలు పార్టీ వైపునకు ఆకర్షితులవడం అభినందనీయమని పార్టీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. వేలేరులో సోమవారం రాత్రి టీడీపీలో చేరిన వారికి తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వేలేరుకు చెందిన పోలగాని వరప్రసాద్, సుధాకర్, కాసగాని రాంబాబు, కొండేటి బాజి, శ్రీను, దేశిన రాజేష్, మేకపోతుల రాజేష్, కాసగాని కోటయ్య, వలదాసి సత్యవేదం, రాచప్రోలు శ్యామ్‌కిషోర్, డేవిడ్, కనకవల్లి సుందరరావు, మహ్మద్ సుభాని, పిల్లి శ్రీను, వీర్ల వెంకటేశ్వరరావు, మహ్మద్ మస్తాన్, షేక్ కాలీషా, భరోతు విజయ్, బాణవతుల గోపి, బాణావతుల నాగరాజు తదితరులు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కాజా సురేష్, కార్యదర్శి అంగడాల సీతయ్య, యువత అధ్యక్షుడు పోలగాని వెంకటేశ్వరరావు, బర్రె బసవరాజు, ఆవిర్నేని భవానీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ నిరసనను జయప్రదం చేయండి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 13 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక, రైతు సంఘాలు తలపెట్టిన గ్రామీణ భారత్ ఆందోళన కార్యక్రమంలో రైతులు, కౌలురైతులు ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం బాపుల పాడు మండల కార్యదర్శి బేత శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 16న జరిగే నిరసన కార్యక్రమంలో ఆయా వర్గాలు కదలి వచ్చి ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ప్రమాదకరంగా రోడ్డు!

- కోతకు గురవుతున్న ఉయ్యూరు- కాటూరు రహదారి
- వాహనదారులకు తరచూ ప్రమాదాలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 13 : ఉయ్యూరు- కాటూరు- తేలప్రోలు ఆర్‌అండ్‌బీ రోడ్డు కోతకుగురై ప్రమాదకరంగా మారింది. వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉయ్యూరు నుంచి కాటూరు, తేలప్రోలు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు శ్రీవిశ్వశాంతి స్కూల్ సమీపాన కోసుకుపోతూ ప్రమాదస్థితికి చేరుకుంది. స్కూల్‌కు వెళ్లే విద్యార్థులతో పాటు మండల పరిధి గ్రామాలతో పాటు ఉంగుటూరు, పెదపారుపూడి మండలాల గ్రామాలకు వెళ్లే వాహనాలు, బస్సులతో అనునిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో స్కూల్ సమీపాన కొంతమేర ఓ పక్క కోతకు గురైంది. ఈ ప్రాం తంలో రోడ్డు పక్కన గ్రామ పంచాయతీ చెత్తకుండీలు ఏర్పాటు చేయగా రోడ్డు పొడవునా పరిసర ప్రాంతాల్లో నివసించేవారు ఇళ్లలోని వ్యర్థాలు, చెత్తపోయడంతో ఎలుకలు చేరి రోడ్డును తొలచి వేస్తున్నాయి. దీంతో కొంత మేర రోడ్డు డొల్లగా తయారై ప్రమాదకరంగా ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరింత మేర కోతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, గండిగుంట గ్రామ పంచాయతీ అధికారులు కూడా చెత్తకుండీలు అక్కడ నుంచి తొలగించి మరో చోట ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురైన రోడ్డు



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్సైలు అర్జమ్మ, జనార్దన్

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 13 : ప్రయాణికుల కోసం ఆటోలను రోడ్డుపై నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కల్పిస్తే చర్యలు తప్పవని ఎస్సై -2 పి.అర్జమ్మ ఆటోడ్రైవర్లను హెచ్చరించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఆక్రమణలతో అవస్థలు' కథనంపై జంక్షన్ పోలీస్ యంత్రాంగం స్పందించింది. మంగళవారం రోడ్డు మార్జిన్ ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారులను హెచ్చరించి, వెనక్కి నెట్టించి రోడ్డు క్లియర్ చేశారు. అనంతరం స్థానిక ఆటో డ్రైవర్లు, ఆ సంఘం నాయకులతో పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు వివరించి హెచ్చరికలు జారీ చేశారు. రోడ్డు మార్జిన్‌లో ఆటోలు నిలపటం, గంటల తరబడి పార్కింగ్ చేయడం వలన ఇతర వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఆటోలు రోడ్డు మార్జిన్ లోపలే నిలబెట్టుకోవాలని సూచించారు. నిబంధనలు ప్రకారం అన్ని ధృవపత్రాలు కలిగి ఉండాలని, నిర్దేశించిన ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్సై జనార్దన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సమస్యలను అధిగమించాలి

ఉంగుటూరు, ఫిబ్రవరి 13 : విద్యార్థులు తమ సృజనాత్మకతకు ఎదురయ్యే సమస్యలను కొత్తనైపుణ్యాలు, దృక్పథాలతో అధిగమించాలని, తద్వారా ఆయా రంగాల్లో విజయ అవకాశాలను మరింతగా మెరుగుపర్చుకోవాలని కృష్ణశ్రీ పరిపూర్ణ ఫౌండేషన్ డైరెక్టర్, సామాజికవేత్త, పేరిచర్ల శ్రీలత అన్నారు. విద్యార్థుల్లో గెలుపు అవకాశాలను ఏ విధంగా మెరుగుపరచుకోవచ్చు అనే అంశంపై మంగళవారం తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహనా సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న శ్రీలత కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు సలహాలు, సూచనలు చేశారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలు, నైపుణ్యాలను మెరుగుపరచు కోవాలన్నారు. ఈ సదస్సులో కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, డైరెక్టర్ కె.రాజశేఖరరావు, సీఎస్‌సీ అండ్ ఏఐ విభాగాధిపతి కేపీఎస్‌వీ సత్యశ్రీ, అధ్యాపకులు, సీఎస్ఈ, ఐటీ, ఏఐడీఎస్, ఏఐఎంఎల్ విద్యార్థులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 13 : స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులకు దాతలు అన్నదానం నిర్వహించారు. జంక్షన్‌కు చెందిన పూల వ్యాపారి బోదటి శ్రీనివాసరావు, వెంకటేశ్వరమ్మ దంపతులు 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ముందుగా ఆలయం, అన్నదాన ప్రాంగణంలో దాతలు పూజలు నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు నాగభూషణం, ఈవో కె.శ్రీనివాస్ దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి అభినందించారు. ఏర్పాట్లను పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గన్నవరంలో అభివాదం చేస్తున్న ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు

గన్నవరం, ఫిబ్రవరి 13 : ఉద్యోగుల, కార్మికుల, పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్‌జీవో గన్నవరం అసోసియేషన్ అధ్యక్షులు వి.సాంబశివరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎన్‌జీవో కార్యాలయంలో ఉద్యోగ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులను ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందన్నారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవరపల్లి విద్యాసాగర్, ఎం.వంశీమోహన్ కృష్ణ, కె.వెంకటేశ్వరరావు, ఎం.రవికుమార్, పులిపాక సురేందర్, ఎం.రవిబాబు, పి.రాజాబాబు, రవికుమార్, శ్రీనివాసరావు, వల్లి, తిరుపతిరావు పాల్గొన్నారు.

సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 13 : సనాతన హిందూ సంప్రదాయాలను యువతకు తెలియచెబుతూ ధర్మపరిరక్షణలో వారిని భాగస్వాములు చేసేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సబ్ డివిజన్ ధర్మప్రచారక్ యడవల్లి పాండు రంగారావు అన్నారు. బండారుగూడెంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్మనిధి సభ్యత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యువతకు హిందూ సంస్కృతిపై అవగాహన కల్పిస్తూ దేశభక్తితో ధర్మపరిరక్షణకు మన వంతు సహకారంగా సభ్యత్వాన్ని స్వీకరించి సహకారమందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాదు భూషమ్మ, కనక రత్నం, వాణి, హారతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పెనమలూరు, ఫిబ్రవరి 13 : యనమలకుదురు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల పనుల నేపథ్యంలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డొంకరోడ్డు, ఇందిరానగర్1, 2 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కార్యనిర్వాహక ఇంజనీర్ హరిబాబు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఉంగుటూరు, ఫిబ్రవరి 13 : సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, అప్రమత్తంగా వ్యవహరిస్తే సైబర్ నేరగాళ్లను కట్టడి చేయవచ్చునని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు అన్నారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నారయ్య అప్పారావుపేటలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్ మంగళవారం ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి సైబర్ నేరాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఆధార్ వేలిముద్రలు లాక్, అన్‌లాక్ చేసుకోవడం వల్ల కలిగే లాభాలు, అనవసర లింక్‌లు క్లిక్ చేయడంవల్ల కలిగే అనర్థాలు, నష్టాలపై ప్రజలకు వివరిం చారు.సర్పంచ్ ఎన్.నాగరాజు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	143, 152, 163
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.36

హస్తకళా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

కోడూరు: మహిళలు నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఆర్థికంగా స్థిరపడాలని హస్త కళా అభివృద్ధి అధికారి ఎం.సువర్చలా అన్నారు. కోడూరు-1వ వార్డులో మంగళవారం కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ సౌజన్యంతో ఏపీఐటీసీవో హైదరాబాద్ ఆధ్వర్యంలో 30మందికి హ్యాండ్ ఎంబ్రాయిడరీ హస్త కళాకారులకు కుట్టుమిషన్, టూల్ కిట్స్ పంపిణీ చేశారు. కోడూరు మండల రెవెన్యూ అధికారిణి సుభాషిణి, పీడీ సుదీర్ కుమార్, కోట అరుణ, కోట కరుణకుమార్ పాల్గొన్నారు.

దొంతులమ్మవారి ఆలయంలో ప్రత్యేక అర్చనలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 13 : దొంతులమ్మ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. శ్రీనివాసా మ్యూజికల్ అకాడమీ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. కోలాట కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు సైకం సోమశేఖర్, రంగనాయకులు పర్యవేక్షించారు.






గూడూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దేశం నేతలు, దోసపాడులో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన కుటుంబాలతో కుమార్ రాజా, కోకనారాయణపాలెంలో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కాగిత, సురేష్, పెదతుమ్మిడిలో గెలుపే ధ్యేయమంటున్న టీడీపీ నేతలు

ప్రజలను నట్టేట ముంచిన జగన్

• భవిష్యత్‌కు గ్యారెంటీలో కాగిత

పెడన, ఫిబ్రవరి 13 : గూడూరు మండలం కోకనారాయణపాలెం, ఆకుమర్రు గ్రామాల్లో మంగళవారం బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి ప్రజలను నట్టేట ముంచిన జగన్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపాలన్నారు. తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం ఏర్పాటయ్యేందుకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా కృష్ణప్రసాద్ ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. భవిష్యత్తుకు గ్యారంటీ బాండ్లు అందచేశారు. పోతన స్వామి, సాదరబోయిన ఏడుకొండలు, గోపీ నాగబాబు, ఎస్ఏ బేగ్, దాసరి ఉమా సాయిరామ్, చోడగం భిక్షాలరావు, అంబటి అయ్యప్ప, గంజాల కృష్ణమోహన్, కోట మారుతి తదితర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెడన రూరల్: జనసేన, టీడీపీ విజయం సాధిస్తేనే రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందని, యువతకు ఉద్యోగాలొస్తాయని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. జనసేన సమన్వయకర్త పంచకర్ల సురేష్‌తో కలిసి గూడూరు మండలంలోని ఆకుమర్రు, కోకానారాయణపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. 10 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. పార్టీ పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు, పోతన స్వామి, కాసగాని శ్రీను, గోపి నాగబాబు, పరసా సూర్యనారాయణ, రాము, ఏలేష్, బొర్రా శ్రీను, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

బంటుమిల్లి: పెదతుమ్మిడిలో టీడీపీ గెలుపే ధ్యేయంగా కరపత్రాలు పంచుతూ, వైసీపీ అరచకాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రచారం చేస్తున్నారు. మండల పార్టీ కన్వీనర్ కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో యిల్లూరి లీలాకృష్ణ, పాలడుగు వెంకటేశ్వరరావు, మట్టా బ్రహ్మం, బొల్లా శ్రీనివాసరావు, నజీర్, సన్నాల ప్రసాదు, బొర్రాకాశీ, భూపతి రమేష్ పాల్గొన్నారు.

వైసీపీ ఎన్నికల ప్రచారంపై టీడీపీ ఆగ్రహం

గూడూరులో మంగళవారం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ అధికారులు, వలంటీర్లు, ఆశ వర్కర్లు పాల్గొనడంపై మండల టీడీపీ నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రచారంలో పాల్గొన్న అధికారులు, వలంటీర్లు, ఆశ వర్కర్లను వెనక్కి రప్పించాలని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. స్పందించకపోవడంతో ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు.

రాష్ట్ర పురోగతి చంద్రబాబుతోనే సాధ్యం: వర్ల

పెదపారుపూడి: రాష్ట్రం పురోగతి సాధించాలంటే చంద్రబాబు ఎంతో అవసరమని నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి వర్ల కుమార్ రాజా అన్నారు. దోసపాడులో 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వర్ల కుమార్‌రాజా మంగళవారం దోసపాడు పల్లెబాటలో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో చలసాని రమేష్ చౌదరి, గుండపనేని శ్రీనివాసరావు, సజ్జా శివకుమార్, జి.రవికుమార్, మసిముక్కు రాంబాబు, జనసేన నేతలు పాల్గొన్నారు.



చెరువు పూడ్చివేతపై రజకుల ఆందోళన... రోడ్డుపై బైఠాయింపు

మోపిదేవి, ఫిబ్రవరి 13 : పెదప్రోలులో పంచాయతీ ఆధీనంలో ఉన్న చెరువు అక్రమంగా పూడ్చివేస్తున్నారని రజక సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రజకులు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. రజకులకు జీవనాధారంగా ఉన్న చెరువును రాత్రి సమయాల్లో ఏ విధమైన అనుమతులు లేకుండా పూడ్చివేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దశాబ్దాల కాలం నుంచి రజకుల సొసైటీ తరపున గ్రామపంచాయతీకి 31 ఎకరాలకుపైగా చెరువుకు పంచాయతీకి లీజు చెల్లిస్తున్నామన్నారు. ప్రతీ ఏటా పాఠశాల, దేవాలయం, ఇతరత్రా సాకులు చూపి అక్రమంగా పూడ్చివేస్తున్నారన్నారు. లీజు మాత్రం రికార్డుల్లో ఉన్న భూమి ప్రకారం వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. చెరువు క్రమంగా పూడ్చివేయటంతో వచ్చే ఫలసాయం తగ్గుతుందన్నారు. రజకులు జీవనాధారం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. 40నిముషాలకుపైగా జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. చల్లపల్లి సీఐ నాగప్రసాద్, మోపిదేవి ఎస్సై సత్యనారాయణ సిబ్బందితో వచ్చి రజక సంఘం నేతలతో చర్చించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామనటంతో ఆందోళన విరమించారు.



జాతీయ రహదారిపై బైఠాయించిన రజక సంఘం నేతలు




కూచిపూడి, గుడివాడలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల, వామపక్ష నాయకులు

దేశవ్యాప్త ఆందోళన విజయవంతం చేయండి

కూచిపూడి, ఫిబ్రవరి 13 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్‌యూనియన్ నేతలు పిలుపునిచ్చారు. కూచిపూడిలోని సీపీఐ కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు చెరకు శ్రీనివాసరావు, శీలం నారాయణరావు, ఓ.గంగాధర్, కొడాలి శ్రీనివాసరావు, కొడాలి గంగాధర్, చందోలు నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా వామపక్షాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన నిర్వహించే ఆందోళన, నిరసనలను జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు ఆర్‌సిపి రెడ్డి, గూడపాటి ప్రకాష్‌బాబు కోరారు. సుందరయ్యభవన్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మిక సంఘాల నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, రేపాని కొండ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

అవనిగడ్డ రూరల్: వసుమట్లలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గృహాలు దగ్ధమైయ్యాయి. బాధితులను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ మంగళవారం పరామర్శించారు. కట్టుబట్టలతో నిరాశ్రయులుగా మిగిలిన పొనుగుమాటి ఏడుకొండలు, వీర రాఘవులకు తక్షణ సాయంగా రూ.10 వేలు, 50 కేజీల బియ్యం అందజేశారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

దాతల సాయం

వసుమట్ల కాలనీలో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పొనుగుమాటి వీర రాఘవులు, పొనుగుమాటి ఏడుకొండలు గృహాలు కాలిపోయాయి. దాతలు స్పందించి ఆర్థిక సాయమందించారు. సర్పంచ్ దాసరి విజయ్, ఎంపీటీసీ సభ్యుడు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, తోట నరసింహనాయుడు, పాస్టర్ కట్ట ఏడుకొండలు, కోన శ్రీమన్నారాయణ పాల్గొన్నారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. సర్పంచ్ దాసరి విజయ్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో దిలీప్‌కు బంగారు పతకం

గుడివాడ : ఉమ్మడి కృష్ణాజిల్లా బాడీ బిల్డింగ్, ఫిట్నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలో జరిగిన జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ అండ్ ఫిజికల్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో గుడివాడ ఫిట్‌జోన్ బాడీబిల్డర్ ఎస్.దిలీప్ 70కిలోల శరీర బరువు విభాగంలో బంగారు పతకం సాధించినట్లు కోచ్ షేక్ సైదా తెలిపారు. ఏలూరు రోడ్డులోని ఫిట్‌జోన్ జిమ్‌లో మంగళవారం దిలీప్‌ను సత్కరించారు. టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మాగంటి శ్రీనివాస్, వైసీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మలిరెడ్డి రవిరెడ్డి దిలీప్‌ను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

పామర్రు: మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై బల్లిపర్రు అడ్డరోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పెదమద్దాలికి చెందిన వ్యవసాయ కూలీ ఎస్.కె. మస్తాన్‌వలీ (45) తన బైక్‌పై పామర్రు వెళ్లి పనులు ముగించుకుని వెళుతున్న సమయంలో విజయవాడ నుంచి వెనుక వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మస్తాన్ వలిని 108లో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ సీనియర్ నేత మామిడి మృతి

పెడన: బీజేపీ సీనియర్ నేత మామిడి వాసుదేవరావు (74) మంగళవారం మృతిచెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న వాసుదేవరావును చికిత్స నిమిత్తం విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. వాసుదేవరావు రెండుసార్లు బీజేపీ పట్టణాధ్యక్షుడుగా వ్యవహరించారు. ప్రస్తుతం ఆయన కుమారుడు లక్ష్మీనారాయణ గుప్తా బీజేపీ పట్టణాధ్యక్షుడుగా వ్యవహరిస్తున్నారు. నేతలు కట్టా జ్యోతీశ్వరరావు, పిచ్చుక శంకర్, పుప్పాల రాము, కొల్లూరి రాధాకృష్ణ, పత్తిపాటి రమణ, గాజుల సిద్ధార్ధ తదితరులు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

కొమ్మారెడ్డి విద్యార్థికి ఇన్‌స్పైర్ అవార్డు

బంటుమిల్లి: కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ విద్యార్థి కాగిత ప్రభువిశాల్ ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుకు ఎంపికయ్యాడు. 2022-23 విద్యాసంవత్సరానికి ప్రకటించిన దానికి 8వ తరగతి చుదువుతున్న కాగిత ప్రభు విశాల్‌కు రూ.10 వేలు అందజేశారు. డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, కరస్పాండెంట్ శోభ, ఉపాధ్యాయులు అభినందించారు.

భూహక్కు చట్టం రద్దు చేయండి: బార్ సభ్యులు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 13 : భూహక్కు చట్టం రద్దు చేసేవరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తుంగల హరిబాబు అన్నారు. న్యాయదేవత విగ్రహం వద్ద మంగళవారం న్యాయవాదులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ చీకటి చట్టం అమలయితే ప్రజాస్వామ్యానికే ప్రమాదమన్నారు. నిరసన ప్రదర్శనలో అసోసియేషన్ కార్యదర్శి కొట్టె రఘురాం, న్యాయవాదులు డి.పోతురాజు, కొండయ్య, జి.జె. విక్టర్, శివకుమార్, సూర్యప్రకాష్‌రావు, భగత్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను మోసం చేసిన జగన్

పెడన: అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం పట్టణంలోని కొత్తపేటలో మంగళవారం జరిగింది. అధ్యక్షత వహించిన కాకర్ల కోటయ్య మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ఆదుకుంటానన్న జగన్, అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కాడన్నారు. బడ్జెట్‌లో అగ్రిగోల్డ్ బాధితులకు కేటాయింపులు జరపకపోవడం దారుణమన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు షిరాజ్ మాట్లాడుతూ, 2017లో అగ్రిగోల్డ్ బాధితుల నిరవధిక దీక్షా శిబిరానికి వచ్చిన జగన్ తమ ప్రభుత్వం వచ్చిన వారంలో రూ.1180 కోట్లను విడుదల చేస్తానన్నారు. ఐదేళ్లయినా పట్టించుకోలేదన్నారు. ఈనెల 15న విజయవాడలో న్యాయ పోరాట దీక్షకు పెడన ఏరియాలోని అగ్రి బాధితులందరూ హాజరు కావాలని సీపీఐ నేతలు కట్టా హేమసుందరరావు పిలుపునిచ్చారు. మోదుమూడి రామారావు, గగన్, వాసు, శ్రీనివాస్, నాగరాజు, మెహర్ గణేష్, యర్రా గాంధీ పాల్గొన్నారు.

లక్ష్యసాధనతో విద్యార్థులు చదవాలి

ఇసుజు కంపెనీ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్

గుడ్లవల్లేరు: విద్యార్థులు నూతన ఉత్తేజంతో లక్ష్యసాధన కోసం ప్రయత్నిస్తూ ఉండాలని జపాన్ కు చెందిన బహుళ జాతీయ ఇసుజు కంపెనీ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్ అన్నారు. గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం మెకానికల్ విభాగానికి లాబ్ నిర్వహణ కోసం ఇసుజు కంపెనీ రూ.93000 విలువైన ఫోర్ స్ట్రోక్ కట్ సెక్షన్‌ను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద బహూకరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజేష్ మిట్టల్ ఆవిష్కరించారు. ఎంఓయూ పత్రాలను యాజమాన్యం, ప్రిన్సిపాల్‌కు అందజేశారు. సంస్థల చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ రావు, సమకార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, గవర్నింగ్‌బాడీ సభ్యులు వల్లూరుపల్లి వెంకట్ కిరణ్, ఎస్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు, ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్, కోఆర్డినేటర్ జి.వి.వి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎంపికపై లేనిపోని ప్రచారం వద్దు: బండి

మచిలీపట్నం టౌన్: జనసేన, టీడీపీ పొత్తులతో ఇంకా సీట్లు ఖరారు కాలేదని, లేనిపోని ప్రచారాలు కార్యకర్తలు చేయవద్దని మచిలీపట్నం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. జనసేన కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ సోషల్ మీడియా, ప్రింట్ మీడియాల్లో వచ్చే కథనాలు ఊహాజనితాలు మాత్రమేనన్నారు. అభ్యర్థులను చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రకటిస్తారన్నారు. జనసేన నగరాధ్యక్షుడు గడ్డం రాజు, రూరల్ మండలాధ్యక్షుడు గల్లా తిమోతి, కూనపరెడ్డి ప్రసాద్, మహమ్మద్ సమీర్, కర్రి మహేష్, వడ్డి చిరంజీవి, శాయన శివ, మోకా రవి, బీరం సుదర్శన్, కొక్కు లక్ష్మణ, ఈమని మణిబాబు పాల్గొన్నారు.

17న మత్స్యకారుల రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి

మచిలీపట్నం టౌన్: మత్స్యకారుల సమస్యలపై ఈనెల 17వ తేదీన టీటీడీ కల్యాణ మండపంలో జరగనున్న మత్స్యకారుల రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర నాయకుడు పరిమళ్ల వాసు పిలుపునిచ్చారు. మంగళవారం టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వివిధ జిల్లాల కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీ బాధ్యులు 17న ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. జిల్లా అధ్యక్షుడు చిలకలపూడి నాగమల్లేశ్వరరావు, కార్యదర్శి తిరుమాని వెంకట రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పామర్రు: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనలో భాగంగా మంగళవారం సహాయ ఎన్నికల అధికారిణి పి.శ్రీపల్లవి సిబ్బందితో కలిసి పరిశీలించారు. వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన ర్యాంపులు, మురుగుదొడ్ల సౌకర్యాలతోపాటు తాగునీటి అవసరాలు తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్న ఆమె తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ ఎ. రాము పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

పెడన రూరల్ : రబీలో సాగు చేస్తున్న అన్ని పంటలకు రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ అన్నారు. రైతులు మినుముతోపాటు వేరుశెనగ తదితర పంటలను సాగుచేస్తున్నారు. రైతుకు లాభాం కలిగే విధంగా ప్రభుత్వం నుంచి బీమా, సున్నా వడ్డీ, సబ్సిడీపై ఎరువులు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈనెల 15లోగా ఆర్బీకెల్లో నమోదు చేసుకోవాలన్నారు.

16న రథసప్తమి

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 13 : వేకనూరులో ఉషా పద్మిని సమేత సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈ నెల 16న రథ సప్తమి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తుంగల వీర వసంతరావు, ఇందిరా దంపతులు మంగళవారం తెలిపారు. 16న స్వామివారికి విశేష అభిషేకాలు, నిజరూప దర్శనం, అనంతరం సూర్యనమస్కారాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ తదుపరి అభిషేకాలు, సహస్రనామ పూజ, అనంతరం శాంతి కల్యాణం నిర్వహించి, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎస్‌బీఐ పథకాలపై కళాజాతా

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 13 : పులిగడ్డ పాతకోట గ్రామంలో భారతీయ స్టేట్ బ్యాంక్ పథకాల గురించి రాజమహేంద్రవరానికి చెందిన విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ వీధి నాటికను ప్రదర్శించింది. పీఎం జీవన జ్యోతి యోజన పథకం, ప్రధాన మంత్రి సురక్ష, అటల్ పింఛన్ యోజన పథకం, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ పథకం, ఫిక్సిడ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, గోల్డ్ లోన్లు, హౌసింగ్ లోన్ల గురించి వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ శివకృష్ణ, సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతు ప్రముఖుడు గోపాలకృష్ణయ్య కన్నుమూత

అవనిగడ్డ, ఫిబ్రవరి 13 : దివిసీమ రైతు ప్రముఖుడు కమ్మిలి గోపాలకృష్ణయ్య (85)మంగళవారం ఉదయం అవనిగడ్డలోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఐదుగురు కుమార్తెలు. అవనిగడ్డ శివ విద్యా మందిరం, గీతా మందిరం అభివృద్ధి కమిటీ సభ్యులుగా వ్యవహరించారు. అలాగే టీటీడీ కల్యాణ మండపం నిర్మాణ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, గుడివాక శేషుబాబు, కె.నరసింహారావు సంతాపం తెలిపారు. గోపాలకృష్ణయ్య కుమార్తెలు అమెరికా నుంచి రావాల్సి ఉన్నందున గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

మోపిదేవి, ఫిబ్రవరి 13 : బీసీ బాలుర గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మోపిదేవి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీరరవి మంగళవారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి మార్చి 1 నుంచి 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారని, వివరాలకు సమీపంలోని గురుకుల పాఠశాలలో సంప్రదించాలన్నారు.